
సాక్షి
ఒడిశా

శుక్రవారం । 23 । మే । 2025





**శ్రీమందిరం ఆదాయం లెక్కింపు**

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,83,373లు, బంగారం 3గ్రాముల 450 మిల్లీగ్రాములు, వెండి 6 గ్రాముల 900 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



**ఘనంగా హనుమాన్ జయంతి**

హనుమాన్ జయంతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

-10లో



**ప్రాజెక్టులు పూర్తి చేయాలి**

ప్రాజెక్టులు పూర్తి చేయాలని గవర్నర్ సూచించారు. మంత్రులతో సమీక్ష నిర్వహించారు.

-10లో

## న్యూస్‌రీల్

### గొంతు కోసుకున్న ఏఎస్ఐ



గొంతు కోసుకున్న ఏఎస్ఐ చరమా నాయిక్

**జయపురం:** కొట్‌పాడ్‌కు డ్యూటీపై వెళ్లిన ఒక ఏఎస్ఐ గొంతు కోసుకుని ఆస్పత్రి పాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్‌లో బుధవారం స్పెషల్ జస్టిస్ పర్యటన కోసం కొరాపుట్ పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి ఏఎస్ఐ చరమా నాయిక్ విధుల్లో భాగంగా వెళ్లారు. విధులు పూర్తయ్యాక మిగతా సిబ్బందితో కొట్‌పాడ్‌లో ఉన్నారు. కానీ ఉన్నట్టుండి గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. వెంటనే సహచరులు అతడిని కొట్‌పాడ్ కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం జయపురంలోగల కొరాపుట్ జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న జయపురం సదర్ పోలీసు అధికారి సచింద్ర ప్రధాన్, పట్టణ పోలీసు అధికారి ఉల్లాస్ రౌత్‌లు జిల్లా కేంద్రాస్పత్రికి వెళ్లి ఏఎస్ఐ పరిస్థితిపై ఆరా తీశారు.

### బాల్య వివాహాలు నేరం



మాట్లాడుతున్న మీనతి దేవ్

**రాయగడ :** బాల్య వివాహాలు వల్ల బంగారు భవిష్యత్తు నాశనమవుతోందని జిల్లా సామాజిక సంక్షేమ శాఖాధికారి మీనతి దేవ్ అన్నారు. స్థానిక సమితి కార్యాలయంలో గురువారం బాల్య వివాహాల నివారణపై చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాల నివారణకు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అంగన్‌వాడీ కార్యకర్తలు సైతం తమవంతు కృషి చేయాలన్నారు. చిన్న వయసులో పెళ్లి చేసుకుంటే కలిగే అనర్థాలను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు బీడీఓ కాలుచరణ్ నాయక్, వివిధ ధార్మిక సంఘాల ప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కూలిన ఇంటి గోడ



గోడ కూలిపోయిన దృశ్యం

నిరాశ్రయుడైన డంబురుధర్ నాయక్

**రాయగడ:** జిల్లాలోని కాసీపూర్ సమితి చంద్రగిరి పంచాయతీ సురిగుంజ్ గ్రామంలో గురువారం కురిసిన భారీ వర్షం ధాటికి డంబురుధర్ నాయక్ అనే వ్యక్తికి చెందిన ఇంటి గోడ కూలిపోయింది. లోతట్టు ప్రాంతంలో ఇల్లు ఉండటంతో వర్షం నీరంతా లోపలికి చొరబడటంతో ఈ ఘటన చోటుచేసుకుంది. వస్తువులన్నీ తడిసి ముద్దయ్యాయి. నిరాశ్రయుడైన నాయక్ కుటుంబం రోడ్డున పడింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

### లబ్ధిదారులతో గవర్నర్ ముఖాముఖి సంభాషణ



కేంద్ర ప్రభుత్వం పథకాల లబ్ధిదారులతో గవర్నరు ముఖాముఖి సంభాషణ

**భువనేశ్వర్:** ఖుర్దా జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర గవర్నర్ డాక్టరు హరిబాబు కంభంపాటి స్థానిక కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో ముఖాముఖి సంప్రదించి సంభాషించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి ముద్రా యోజన లబ్ధిదారులను కలిశారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన – గ్రామీణ మరియు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన – పట్టణ పథకాల కింద లబ్ధిదారుల ఇళ్లను గవర్నరు ప్రత్యక్షంగా సందర్శించారు. ఖుర్దా మున్సిపాలిటీ 4వ నంబరు వార్డు, ఖుర్దా మండలం బొరా సాహి గ్రామ పంచాయతీ కుంభిలో ప్రాంతాల్లో గృహ నిర్మాణ పథకాలతో లబ్ధిదారుల వాస్తవ అభిప్రాయాన్ని, అనుభవాలను అర్థం చేసుకోవడానికి ఆయన ముఖాముఖి సంభాషించడం విశేషం.

# కరోనా.. కలకలం



- భువనేశ్వర్‌లో తొలి కేసు నమోదు
- ఢిల్లీ నుంచి తిరిగొచ్చాక నిర్వహించిన వైద్యపరీక్షల్లో పాజిటివ్‌గా గుర్తింపు
- ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం



**భువనేశ్వర్:** రాష్ట్రానికి కరోనా మహమ్మారి తిరిగొచ్చింది. గురువారం తొలి కరోనా కేసు నమోదైంది. రాజధాని నగరం భువనేశ్వర్‌కు చెందిన వ్యక్తికి కరోనా సోకింది. ఇతను ఇటీవలే ఢిల్లీ నుంచి తిరిగి వచ్చాడు. ప్రస్తుతం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. బాధితుడు ఇప్పటికే పలు వ్యాధులతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఢిల్లీ నుంచి తిరిగొచ్చాక వైద్య పరీక్షలు చేయించుకోగా కోవిడ్ పాజిటివ్ అని తేలింది. కొత్త కరోనా కేసు వెలుగులోకి రావడంతో రాష్ట్ర ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కరోనా సోకిన వ్యక్తి ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడని స్థానిక ఆరోగ్య శాఖ అధికారులు ధ్రువీకరించారు. అతని ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం సదరు వ్యక్తి ఆరోగ్యం బాగానే ఉందని, వైద్య సంరక్షణలో చికిత్స పొందుతున్నాడని చెప్పారు.



మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి అశ్వత్థి

**ప్రజారోగ్య శాఖ చర్యలు..**

కోవిడ్ కేసు వెలుగుచూడటంతో స్థానిక ఆరోగ్య అధికారులు అప్రమత్తమయ్యారు. బాధితుడి సన్నిహితుల్లో ఎవరికైనా కరోనా లక్షణాలు ఉన్నాయో లేదో గుర్తించేందుకు ట్రేసింగ్ కార్యాచరణ అమలు చేస్తున్నారు. వ్యాప్తిని నివారించడానికి చర్యలు చేపడుతున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం సైతం పౌరులను అప్రమత్తంగా ఉండాలని కోరింది. భద్రతా మార్గదర్శకాలను పాటించాలని విజ్ఞప్తి చేసింది. బయటకు వెళ్లేటప్పుడు మాస్కులు ధరించాలని సూచించింది. చేతులు తరచూ శుభ్రపరుచుకుంటూ సామాజిక దూరం పాటించడం వల్ల కరోనా సంక్రమణను అరికట్ట వచ్చని పేర్కొంది.

**కదిలిన యంత్రాంగం..**

కొత్త కోవిడ్ వైరస్ గుర్తింపుతో రాష్ట్ర ఆరోగ్య శాఖ యంత్రాంగం తక్షణ చర్యలకు నడుం బిగించింది. తొలి కేసు పూర్వాపరాలపై ఆరా తీసేందుకు సమగ్ర నివేదిక రూపకల్పన ప్రక్రియలో ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి, ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ సమావేశమై కరోనా సంక్రమిత కదలిక, విస్తరణ, తీవ్రత అంశాలపై చర్చించారు.

**భయపడొద్దు..**

నగరంలో కరోనా పీడితుని గుర్తింపు ప్రజల్ని కలవరపరుస్తున్న నేపథ్యంలో ప్రజలు ఏమాత్రం భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు, నగర మేయర్ అన్నారు. గురువారం భువనేశ్వర్‌లో కోవిడ్ కేసు నమోదైన నేపథ్యంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ కమిషనర్, కార్యదర్శి ఎస్.అశ్వత్థి విలేకరులతో మాట్లాడారు. దేశం నుండి కోవిడ్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోలేదని, ఈ వ్యాధికి సంబంధించిన కేసులు ఇప్పటికీ అక్కడక్కడా తారసపడుతున్నాయని చెప్పారు. రాజధాని నగరంలో తాజాగా నమోదైన కోవిడ్ కేసు తక్కువ తీవ్రతతో కూడుకున్నదని తెలిపారు.కోవిడ్ బారిన పడిన వ్యక్తి ఇతర వ్యాధులతో దీర్ఘకాలంగా చికిత్స పొందుతున్నాడని,. అతను కోవిడ్ ద్వారా మాత్రమే ప్రభావితమైనట్లు పరిగణించేది లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ కోవిడ్ పరిస్థితిని తీక్షణంగా పర్యవేక్షిస్తోందని చెప్పారు. ఇదే విషయాన్ని స్థానిక నగర పాలక సంస్థ బీఎంసీ మేయర్ సులోచనా దాస్ పేర్కొన్నారు. ప్రజలు ధైర్యంగా ఉండాలని కోరారు.

# కలెక్టరేట్ వద్ద నిరసన




గజపతి కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వెళుతున్న అఖిల భారత కిసాన్ సభ నాయకులు


**పర్లాకిమిడి:** పంజాబ్ రాష్ట్రం సంగ్రూర్ జిల్లాలో ఆమ్‌ఆద్మీ సర్కారు దళితులపై అక్రమంగా కేసులు బనాయించి వందలాది మంది జమీన్ ప్రగతి సంఘర్ష కమిటీ (జెడ్.పి.యస్.సీ.) సభ్యులను అరెస్టు చేయడంపై ఆల్ ఇండియా కిసన్ మజ్దూర్ సభ, గజపతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు కేదార్ శోబోరో మాట్లాడుతూ, పంజాబ్‌లో సంగ్రూర్ జిల్లాలో మహారాజా జండ్ తాలుకా 927 జమీందారీ భూములు పంచిపెట్టాలను అడిగితే జమీన్ ప్రగతి సంఘర్ష కమిటీ నాయకులను అరెస్టు చేసినందుకు ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని అన్నారు. సంగ్రూర్‌లో దళిత నాయకులను విడుదల చేయాలని, పోలీసు బలగాలు వెనక్కి తీసుకోవాలని డిమాండు చేస్తూ పంజాబ్ గవర్నరు భగవంత్ మాన్‌కు ఉద్దేశించి రాసిన వినతిని కలెక్టరేట్ అసిస్టెంటు కలెక్టర్ త్రిబేన్ దేవికి అఖిల భారత కిసాన్ సభ నాయకులు కేందార్ శోబొరా అందజేశారు.




గజపతి కార్యాలయం వద్ద అఖిల భారత కిసాన్ సభ ఆందోళన

# మల్కన్‌గిరిలో చొరబాటుదారుల గుర్తింపు

**మల్కన్‌గిరి:** ఒడిశా నుంచి బంగ్లాదేశ్ చొరబాటుదారులకు రప్పించే ప్రక్రియ వేగవంతమైన తర్వాత అన్ని జిల్లాల్లో హడావుడి నెలకొంది. ఇందులో భాగంగా మల్కన్‌గిరి జిల్లాలో పీనల్ ప్రాజెక్ట్ ప్రాంతంలోని పునరావాస శరణార్థి శిబిరాల్లో వివిధ సమయాల్లో అక్రమంగా ఉంటున్న బంగ్లాదేశ్ చొరబాటుదారులను గుర్తించారు. మొత్తం 663 మంది చొరబాటుదారులు ఉన్నట్లు నిర్ధారించారు. మొత్తం 213 గ్రామాలు ఉన్నాయి. అప్పట్లో వీరికి గతంలో జీవనోపాధి కోసం భూమి ఇచ్చి ఇతర సదుపాయాలు కూడా కల్పించారు. కొందరికి భారత పౌరసత్వం కూడా లభించింది. ఈ మధ్య కాలంలో బెంగాలీ స్థానిక చొరబాటుదారులు మల్కన్‌గిరి జిల్లాలోకి చొరబడి వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. 2001లో 469 మంది చొరబాటుదారులను గుర్తించగా, 2024 నాటికి సర్వేలో 663 మందిని గుర్తించారు. పహెల్గాం ఉగ్రదాడి తర్వాత చొరబాటుదారుల ఏరివేత ప్రారంభం కావడంతో అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశీయులను గుర్తించి వెనక్కి పంపేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ టాస్క్ ఫోర్స్‌ని నోడల్ ఏజెన్సీగా నియమించింది.



## వాటర్‌షెడ్ విభాగంలో విజిలెన్స్ దాడులు

- నలుగురి అరెస్టు

**రాయగడ:**

జిల్లా కేంద్రంలోని వాటర్ షెడ్ విభాగంలో కొరాపుట్ విజిలెన్ అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. అవినీతికి పాల్పడిన నలుగురిని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో వాటర్‌షెడ్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ రాజేంద్రనాథ్ నాయక్, సాయల్ కంజర్వేషన్ ఓవర్‌సీర్ జోగేంద్ర ఖోషల, దీపక్ కుమార్ సాహు, శ్రీకుమార్ నాయక్ ఉన్నారు. జిల్లాలోని కాసీపూర్ సమితిలో చెరవులు తవ్వినట్లు తప్పుడు లెక్కలు చూపించి సుమారు రూ.20 లక్షల నిధులు స్వాహా చేసినట్లు విజిలెన్స్ అధికారుల దృష్టికి రావడంతో ఈ దాడులు నిర్వహించినట్లు సమాచారం. బినామీ పేర్లతో జాబ్‌కార్డులను సృష్టించి అందులో జమైన నిధులను కాజేసినట్లు గుర్తించారు. నిందితులను అరెస్టు చేసి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.



రాజేంద్ర నాయక్



దీపక్ కుమార్ సాహు



జోగేంద్ర ఖోషల



శ్రీకుమార్ నాయక్

## భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతి



ఆంజనేయ స్వామికి అభిషేకం

**భువనేశ్వర్ :** హనుమాన్ జయంతి పురస్కరించుకుని ఖుర్దారోడ్ అకౌంట్స్ కాలనీ బాలాజీ మందిరం హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజాదులు జరిపించారు. ఈ సందర్భంగా అభయాంజనేయ స్వామికి అభిషేకం, అష్టోర శత నాగవల్లి (తమలపాకులు) దళార్చన, కదలీ ఫలార్చన, హనుమాన్ చాలీసా పారాయణం పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఉత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చారుమళ్ల కోసం తాటి మట్టలు విరాళం



తాటి చెట్ల గుర్తింపు

**భువనేశ్వర్:** పూరీ శ్రీ జగన్నాథుని రథయాత్రలో అందరూ భాగస్వాములే. రథాల పైకి మూల విరాట్లు, ప్రతినిధి మూర్తులు ఎక్కించి దింపేందుకు తాత్కాలిక కాలి బాట ఏర్పాటు చేస్తారు. చారుమళ్లగా వ్యవహరించే వీటి తయారీ కోసం తాటి మట్టలు వినియోగిస్తారు. ఈ ఏడాది 3 రథాల కోసం అవసరమయ్యే చారుమళ్ల తయారీకి తాటి చెట్లు విరాళంగా అందజేసేందుకు ఓ భక్తుడు స్వచ్ఛందంగా ముందుకు వచ్చాడు. భక్తుని ప్రకటన ప్రకారం సంప్రదించేందుకు శ్రీ మందిరం యంత్రాంగం తాటి చెట్లు లభ్యం అయ్యే ప్రాంతాన్ని ప్రత్యక్షంగా సందర్శించింది. ఈ సందర్భంగా రథాల చారుమళ్ల కోసం తాటి మట్టల దృఢత్వం పరిశీలించారు. దాతకు కృతజ్ఞతపూర్వకంగా శ్రీ మందిరం రత్న వేదికపై కొలువు దీరిన మూల విరాట్లకు నివేదించిన పాడి ప్రాదం అందజేసి ఉత్తరీయంతో సత్కరించి అభినందించారు.

ఢెంకనాల్ జిల్లా ఖడ్గ ప్రసాద్ ప్రాంతంలో ఉంటున్న విజయ్ సాహు ఈ ఏడాది రథ యాత్ర నిర్వహణకు అవసరమైన చారుమళ్ల తయారీకి అవసరమైన తాటి చెట్లు విరాళంగా అందజేశారు. శ్రీమందిర్ పాలన విభాగం అభివృద్ధి నిర్వాహకుడు, రథాల పర్యవేక్షకుడు, భోయ్ సర్దార్, మహరణ (వడ్రంగి) నిపుణులతో కూడిన సంయుక్త బృందం ఖడ్గ ప్రసాద్ గ్రామం సందర్శించి చెట్లను ఎంపిక చేసింది. అటవీ శాఖ సాయంతో వాటిని నరికి రవాణా ఏర్పాట్లు చేశారు. త్వరలో ఈ దూలాలు రథాల తయారీ ప్రాంగణానికి చేరనున్నాయి.



దాతకు సత్కరించిన శ్రీ మందిరం అధికార బృందం

## రెడ్‌క్రాస్‌కు మూడేళ్ల వేతనం విరాళం



నబరంగ్‌పూర్ మున్సిపల్ చైర్మన్ కునునాయక్ తో కలసి ఈఓకి చెక్కు అందజేస్తున్న కౌన్సిలర్ మురళి

**కొరాపుట్:** తన మూడేళ్ల వేతనాన్ని రెడ్‌క్రాస్‌కు కౌన్సిలర్ విరాళం ఇచ్చారు. గురువారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో 5 వార్డు ఇండిపెండెంట్ కౌన్సిలర్ ఐ.మురళీకృష్ణ రు.10 వేలు విరాళం చెక్కు అందజేశారు. తాను పాల్గొన్న ప్రతి కౌన్సిల్ సమావేశానికి రు.150 చొప్పున ప్రభుత్వ గౌరవ వేతనం అందిందన్నారు. ఈ నగదు మున్సిపల్ చైర్మన్ కున్ను నాయక్ తో వెళ్లి ఈఓ సమరేష్ మహంతికి చెక్కు రూపంలో అందజేశారు.

# పిడుగు పడి బాలుడి మృతి



మత్తిలి ఆరోగ్య కేంద్రం వద్ద రాహుల్ మృతదేహం



చికిత్స పొందుతున్న సుకాంత్ చార్కి

**మల్కన్‌గిరి :** మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి దళపతిగూడ పంచాయతీ మేడుకూలి గ్రామంలో గురువారం మామిడి తోటలో పిడుగు పడి రాహుల్ మాడి(10) మృతి చెందాడు. మరో ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామం నుంచి మామిడితోటలో పండ్ల కోసం రాహుల్, సుకాంత్ చార్కి, (9), సావిత్రీ గోలారీ (22) వెళ్లారు. సరిగ్గా అదేసమయంలో పిడుగు పడడంతో రాహుల్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. మిగతా పిల్లలు కూడా గాయపడ్డారు. విషయం తెలిసి గ్రామస్తులు వీరిని మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరీక్షించిన వైద్యులు రాహుల్ చనిపోయినట్లు గుర్తించారు. దీంతో రాహుల్ తండ్రి మత్తిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



చికిత్స పొందుతున్న సావిత్రీ గోలారీ

## హోటళ్లలో తనిఖీలు

**రాయగడ:** జిల్లాలోని గుణుపూర్‌లో పలు హోటళ్లలో పౌర సరఫరాల శాఖ అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న మూడు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. కమర్షియల్ సిలిండర్లకు బదులు డొమెస్టిక్ సిలిండర్లను వినియోగించడంపై హోటళ్ల యజమానులకు హెచ్చరించారు. తనిఖీల్లో గుణుపూర్ పట్టణ పౌరసరఫరాల శాఖ అధికారి దేవవ్రత మహాపాత్రో, ఇన్‌స్పెక్టర్ నిఖిల మోహన్ బస్తియా, రామనగుడ భవానీప్రసాద్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

**కొరాపుట్:** జయపూర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ నౌరి మహంతి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మెయిన్ రోడ్డులో పాత తహసీల్దార్ కార్యాలయం ఎదుట అగ్రసేన్ భవనం వైపు ఉన్న స్టాల్స్ పడగొట్టి పునః నిర్మాణం చేయనున్నారు. పాత బస్టాండ్ ఎదుట గోవర్ధన్ చెరువు వద్ద పార్కింగ్ స్థలానికి టెండర్ వేయాలని నిర్ణయించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బి.సునీత మాట్లాడుతూ 80 ఏళ్ల పైబడి ఉన్న వృద్ధులకు పింఛన్ల కోసం తమ ప్రతిపాదనలను సిబ్బంది పట్టించుకోకపోవడం తగదన్నారు. సమావేశంలో జయపూర్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహీణీపతి, సబ్ కలెక్టర్ అక్కవరం ప్రశ్యా రెడ్డి, ఎంపీ ప్రతినిధి హసన్ మదాని తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### లంచగొండి ఇన్‌స్పెక్టర్ ఆటకట్టు

- పలాస తూనికలు కొలతల కార్యాలయంలో ఏసీబీ దాడులు
- రూ.1.78 లక్షలు లంచం తీసుకుంటూ దొరికిన తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్



పలాసలో తూనికలు కొలతల కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ముందు పట్టుబడిన ఇన్‌స్పెక్టర్ శ్రీధర్

**కాశీబుగ్గ:** పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పలాస మండలం తూనికలు కొలతల కార్యాలయంలో గురువారం ఆ శాఖ అధికారి లంచం తీసుకుంటూ దొరికిపోయారు. వివరాల్లోకి వెళితే.. పలాస తూనికలు కొలతల శాఖ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీధర్ ప్రభుత్వ లైసెన్స్ పొందిన రిపేరర్స్ వద్ద రూ.1.78 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తన సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నారు. జిల్లాలో పద్నాలుగు మండలాలకు ఈయన ఒక్కరే ఇన్‌స్పెక్టర్ కావడంతో అన్ని ప్రాంతాలు తిరగడానికి వీల్లేక.. ప్రతి మండలానికి ఇద్దరు చొప్పున ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్‌లు మరమ్మతులు చేసే ప్రభుత్వ లైసెన్సు పొందిన వ్యక్తులను పెట్టుకుని వారి ద్వారా అదనంగా నగదు వసూలు చేస్తూ వస్తున్నారు. ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్‌లు పనిచేస్తున్నట్లు తని ఖీలు చేసి సీలు వేసి సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. ఆ సర్టిఫికెట్ ఇవ్వాలంటే ప్రభుత్వానికి రూ.300 చలానా తీయాలి. అయితే దీంతో పాటు రూ.400 అదనంగా తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నా యి. ఇవ్వకపోతే పదే పదే తనిఖీల పేరుతో ఇబ్బందులు పెడుతున్నారు. దీంతో కొందరు వ్యాపారులు ఏసీబీ అధికారులను సంప్రదించారు. మొత్తం 441 మంది వ్యాపారుల వద్ద ఏడాదికి సర్టిఫికెట్ కోసం రూ.1.78 లక్షలు తన సిబ్బంది నుంచి తీసుకుంటూ ఉండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి మాట్లాడు తూ వ్యాపారుల వద్ద అక్రమంగా వసూలు చేసిన నగదు తీసుకుంటుండగా పట్టుకున్నామని, కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నామని వెల్లడించారు.

### సూక్ష్మ రూపధారి..



ఆంజనేయగద, శ్రీరామనామం

**హనుమద్ జయంతి సందర్భంగా సూక్ష్మ కళాకారుడు కొత్తపల్లి రమేష్ ఆచారి హను** మంతుని గద, శ్రీరాముని రామబాణం తయారు చేశారు. పలుచటి బంగారపు రేకు పైన ఎలాంటి అతుకులు లేకుండా రెండు గంటలు కష్టపడి చిన్న గద, బుల్లి రామ బాణం తయారు చేశారు.

–కాశీబుగ్గ

# ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయాలి



సమీక్ష నిర్వహిస్తున్న రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి

- గవర్నర్ కంభంపాటి హరిబాబు
- అధికార యంత్రాంగంతో సమీక్ష

**భువనేశ్వర్:** రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాల్ని సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి అధికారులను ఆదేశించారు. కుళాయి నీటి పథకం 100 శాతం పూర్తి చేయాలన్నారు. గురువారం ఖుర్దాలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగంతో సమీక్ష నిర్వహించారు. ప్రజారోగ్యం, వ్యవసాయం, నీటి వనరులు, పర్యాటకం, మత్స్య సంపద, ఉద్యానవనం, పశుసంవర్ధకం, భూ సంరక్షణ, గ్రామీణ నీటి సరఫరాలో జరుగుతున్న ప్రగతిపై ఆరా తీశారు. జిల్లాలోని శాంతి భద్రతల పరిస్థితిని పరిశీలించారు. ఆయుష్మాన్ భారత్ – ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన్ మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ, పట్టణ), ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన, ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన, ప్రధాన మంత్రి ముద్ర యోజన వంటి కీలకమైన కేంద్ర ప్రభుత్వ పథకాల పనితీరుపై సమీక్షించారు.

**గవర్నరు సంతృప్తి..**

సమీక్ష తర్వాత గవర్నర్ మీడియాతో మాట్లాడారు. ఖుర్దా జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధాన్‌మంత్రి గ్రామ సడక్ యోజన కింద స్థిరమైన పురోగతిని ఆయన ప్రశంసించారు. జల్ జీవన్ మిషన్ కింద ప్రాజెక్టులను వేగవంతం చేయాల్సి ఉందన్నారు. దాదాపు 70 శాతం గృహాలకు కుళాయి ద్వారా నీటి సరఫరా జరుగుతోందన్నారు. వీలైనంత త్వరగా 100 శాతం పూర్తి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కొన్ని భారీ ప్రాజెక్టుల పని తీరు, పురోగతి పట్ల గవర్నరు అసంతృప్తి వ్యక్తం చేశారు. వీటిని సకాలంలో పూర్తి చేసేలా చొరవ తీసుకోవాలన్నారు. రాజధాని జిల్లాగా ఖుర్దా ప్రాముఖ్యతను వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధికి ఈ జిల్లా పురోగతి ప్రామాణిక నిర్దేశించాల్సిన బాధ్యతను అధికారులు గుర్తించాల్సి ఉందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 21 పారిశ్రామిక ఎస్టేట్‌లు పురోగతి దశలో ఉన్నాయని చెప్పారు. సూక్ష్మ, లఘు, మధ్య తరహా పరిశ్రమలను (ఎంఎస్‌ఎంఈ) స్థాపించడానికి స్థలం అందుబాటులో ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఖుర్దా జిల్లాలో అవకాశాలను అన్వేషించాలని, బలమైన మౌలిక సదుపాయాల లభ్యత, చురుకైన పరిపాలనా మద్దతు పట్ల ఔత్సాహికులను ప్రోత్సహించాలన్నారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజనను పౌరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర న్యాయ, నిర్మాణం, అబ్కారీ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్, ఖుర్ధా నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రశాంత్ జగదేవ్, ఏకామ్ర భువనేశ్వర్ ఎమ్మెల్యే బాబూసింగ్, ఖుర్దా జిల్లా పరిషత్ అధ్యక్షురాలు రూపశ్రీ రాణి గుమాన్ సింగ్, కలెక్టర్ చంచల్ రాణా, ఎస్పీ సాగరిక నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణుల ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** గర్భిణులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మే 22వ తేదీని 'ప్రీ-ఎక్లాంప్సియా దినోత్సవం'గా ప్రకటించ డంతో, జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన అవగాహన కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. గర్భిణులను ముందుగానే గుర్తించి, రక్తహీనత, గర్భధారణ డయాబెటిస్, సిఫిలిస్, హెమోగ్లోబిన్ స్థాయి, హెచ్‌ఐవీ, క్షయరోగం వంటి అన్ని పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. తీవ్ర తలనొప్పి, చూపు మార్పులు, పొత్తికడుపు నొప్పి, మూత్ర విసర్జన తగ్గడం వంటి ఎక్లాంప్సియా సంకేతాలపై గర్భిణులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ సమస్యలకు అవసరమైన చికిత్స సామగ్రి అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

# జల్సాలపై మోజు.. మోసాలు రివాజు



- ఆగని నాగరాజు నకిలీ ఆటలు
- సీఎం, మంత్రుల ఓఎస్డీల పేరుతో మోసాలు
- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఓఎస్డీ పేరుతో మోసం
- ఫిర్యాదులతో రంగంలోకి దిగిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు
- తాజాగా శ్రీకాకుళంలో అరెస్టు చేసి తీసుకెళ్లిన వైనం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

**జ**ల్సాలకు అలవాటు పడి మోసాలకు పాల్పడుతున్న జిల్లాకు చెందిన మాజీ రంజీ మాజీ క్రికెటర్ బుడుమూరు నాగరాజు తీరు మారలేదు. విలాసవంతమైన జీవితం కోసం నకిలీ ఆటలు ఆడుతూ పోలీసులకు దొరికిపోతున్నాడు. జైలుకు వెళ్లడం, బెయిల్‌పై బయటకు రావడం, మళ్లీ మోసాలకు పాల్పడడం అతడిని అలవాటుగా మారిపోయింది. తాజాగా నాగరాజు మరోసారి బుసకొట్టాడు. ఈసారి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఓఎస్డీ పేరుతో హై ప్రొఫైల్ వ్యక్తులకు మెసేజ్‌లు పెట్టి డబ్బులు గుంజే ప్రయత్నం చేశాడు. కొందరు చేసిన ఫిర్యాదుతో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం జిల్లాకువచ్చి అరెస్టు చేసి పట్టుకెళ్లిపోయారు.

**విలాసాలకు అలవాటుపడి..**

అడ్డగోలుగా సంపాదించాలన్న దుర్బుద్ధితో నాగరాజు వరుస నేరాలకు పాల్పడుతున్నాడు. పలుమార్లు అరెస్టై ఊచలు లెక్కి పెట్టినా అతడిలో మార్పు రావడం లేదు. బ్లాక్ మెయిల్, మోసాలు చేసి సంపాదించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. పోలాకి మండలం యవ్వారిపేటకు చెందిన నాగరాజు ఎంబీఏ పూర్తి చేశాడు. క్రికెటర్‌గా రాణించాడు. రంజీలో ఆంధ్రా తరఫున ఆడాడు. ఆటగాడిగా మంచి భవిష్యత్‌తో ముందుకెళ్లాల్సిన నాగరాజు లగ్జరీలకు అలవాటు పడి, వ్యసనాలకు లోనై తన క్రీడా జీవితాన్ని నాశనం చేసుకోవడమే కాకుండా జిల్లా పరువును తీసేస్తున్నాడు. శ్రీకాకుళం జిల్లా వాసిగా మోసాలకు పాల్పడి ఎప్పటికప్పుడు అడ్డంగా బుక్ అయిపోతున్నాడు.

**ప్రముఖుల పేరు చెప్పి..**


గతంలో తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ వ్యక్తిగత కార్యదర్శి పేరు చెప్పి ఓ ఫార్మా కంపెనీకి టోకరా పెట్టాడు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నప్పుడు ఆయన పీఏ పేరు చెప్పి ఓ సెల్‌ఫోన్ విక్రయ కంపెనీని మోసం చేయబోయి పోలీసులకు చిక్కాడు. గత ఏడాది సీఎం చంద్రబాబునాయుడు ఓఎస్డీ పేరు చెప్పి మోసాలకు పాల్పడి అరెస్టయ్యాడు. తాజాగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఓఎస్డీ పేరు ర్యాపిడో, కంట్రీ డిలైట్ ఎండీలకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేశాడు. అలాగే, పలు రియల్ ఎస్టేట్ కంపెనీలకు మెసెజ్‌లు పెట్టి భారీగా డబ్బులు అడిగాడు. హైదరాబాద్, ముంబై తదితర కీలక నగరాల్లోని హై ప్రొఫైల్ వ్యక్తులను టార్గెట్ చేసి డబ్బులు గుంజుకునే ప్రయత్నం చేస్తున్నాడు. దాదాపు ప్రతి కేసులో అరెస్ట్ అవుతున్నాడు. బెయిల్‌పై వచ్చి మళ్లీ మోసాలకు పాల్పడుతున్నాడు.



మాజీ క్రికెటర్ బుడుమూరు నాగరాజు

**గంజాయి సరఫరా చేస్తూ..**

2023 జూలైలో శ్రీకాకుళం జిల్లాలో గంజాయి సరఫరా చేస్తూ పట్టుబడ్డాడు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు అనేకం చేస్తున్నాడన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. తరచూ అరెస్టై ఊచలు లెక్క పెడుతున్నా ఆయనలో ఏ మాత్రం మార్పు రావడం లేదు. మోసాలు చేసి డబ్బులు సంపాదించడమే అలవాటుగా చేసుకుని బతికిపోతున్నాడు. పలువురు క్రికెటర్లకు స్పాన్సర్స్ పేరుతో పెద్ద పెద్ద వ్యక్తుల ఫొటోలను డీపీలుగా పెట్టుకుని మోసాలకు పాల్పడుతున్నాడు. చాలా మంది ఇతడి మోసాలకు బలైపోయారు. కొందరు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పట్టుబడి జైలుకు వెళ్తున్నాడు.



## ఎస్సీ , ఎస్టీ భూముల రక్షణకు చర్యలు: రెవెన్యూ మంత్రి

**భువనేశ్వర్:** రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు ప్రజలు తమ భూములను నేరుగా ప్రభుత్వానికి అమ్ముకోవచ్చని రెవెన్యూ మంత్రి సురేష్ కుమార్ పూజారి తెలిపారు. ప్రభుత్వం వాటిని దాదాపు 2 నుంచి మూడేళ్ల వరకు విక్రయించకుండా తన వద్ద ఉంచుకుంటుందని,చ విక్రేత కావాలనుకుంటే తిరిగి కొనుగోలు చేసేందుకు వీలు కల్పిస్తుందని, ధనవంతులు ఎస్సీ, ఎస్టీ వర్గాల భూ ఆక్రమణల నుంచి రక్షణ కల్పించడం ఈ చర్య లక్ష్యమని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ) ప్రజల నుంచి నేరుగా భూములను కొనుగోలు చేయాలని యోచిస్తోందని రాష్ట్ర రెవెన్యు, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి గురువారం తెలిపారు.

**కార్పస్ నిధి ఏర్పాటు**

దీని కోసం ప్రభుత్వం త్వరలో కార్పస్ నిధి ఏర్పాటు చేయనుంది. ప్రత్యేక కమిటీ ఈ కార్యకలాపాలను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తుంది. రెవెన్యూ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ఎస్టీ/ఎస్సీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎస్టీ/ఎస్సీ శాఖ డైరెక్టర్, కొంతమంది నిపుణులు మరియు అనుభవజ్ఞులైన అధికారులు ఉంటారు.



సురేష్ కుమార్ పూజారి, రెవెన్యు మంత్రి

ఈ వర్గం ప్రభుత్వ యోచనకు సంబంధించి సమగ్ర నివేదిక దాఖలు చేస్తుంది. కమిటీ నివేదికతో షెడ్యూల్డ్ తెగలు, కులాల సంస్థలు, వివిధ రాజకీయ పార్టీలు, ఎస్టీ, ఎస్సీ శాఖల శాసన సభ కమిటీలు, ఎమ్మెల్యేల సలహాలను పరిగణనలోకి తీసుకుంటారు. అన్ని వర్గాల సలహాలు తీసుకున్న తర్వాత కమిటీ సమర్పించిన నివేదికపై తుది నిర్ణయం తీసుకుంటామని రెవెన్యూ మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఏ ఎస్సీ, ఎస్టీ పౌరుడైనా తన కుమార్తె వివాహం, ఆరోగ్య సంరక్షణ, పిల్లల ఉన్నత విద్య తదితర అత్యవసర, అనివార్య అవసరాల కోసం తన భూమిని అమ్మాలనుకుంటే, ప్రభుత్వం దాన్ని కొనుగోలు చేస్తుందన్నారు. భూ యజమాని కోరుకుంటే, అతను ప్రభుత్వం నుంచి భూమిని తిరిగి కొనుగోలు చేయవచ్చని, కానీ భూ యజమాని భూమిని తిరిగి తీసుకోవడానికి ఇష్టపడకపోతే, ఆ భూమిని ఆ వర్గానికి చెందిన (ఎస్సీ లేదా ఎస్టీ) ప్రజలకు వేలం వేస్తామని రెవెన్యూ మంత్రి సురేష్ పూజారి సవివరంగా తెలియజేశారు.

# ఘనంగా హనుమాన్ జయంతి



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న భాస్కరాచార్యులు



ధ్యానాంజనేయ మందిరంలో పూజలు

**రాయగడ:** హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక మెయిన్ మార్కెట్‌లో గల ధ్యానాంజనేయ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలాజీనగర్ కల్యాణ వేంకటేశ్వర మందిరంలో దాసాంజనేయ త్రిరాత్ర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి.

ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బొడ్డపాడుపై పోలీసు నిఘా

**పలాస:** పలాస మండలం బొడ్డపాడుపై పోలీసులు నిఘా పెట్టారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి నంబాళ్ల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారని వా ర్త వచ్చిన వెంటనే బుధవారం సాయంత్రానికి బొడ్డపాడు గ్రామానికి పోలీసులు చేరుకున్నారు. కేశవరావు మృత దేహాన్ని తీసుకు రావడానికి గ్రామం నుంచి వెళ్తున్నారా అని స్థానిక పోలీసులు గ్రామస్తులను అడగడంతో ఆయన తమ గ్రామానికి చెందిన వ్యక్తి కాదని, రాజకీయ బంధుత్వం మాత్రమే ఉందని చెప్పి పోలీసులను తిరిగి పంపించేశారు. ఈ నేపథ్యంలోనే కేశవరావు గ్రామం నుంచి అతని బంధువులు, కొంత మంది మాజీ మావోయిస్టులు అతని మృతదేహాన్ని తీసుకుని రావడానికి వెళ్లారు. కానీ వారికి కేశవరావు మృతదేహం చూపించలేదని సమాచారం. బొడ్డపాడులో మాత్రంలో బుధవారం సాయంత్రం నుంచి గురువారం రాత్రివరకు పోలీసులు మఫ్టీలో సంచరించారు. అలాగే కేశవరావు ఎన్‌కౌంటర్‌ను సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు ఖండిస్తున్నారు. జిల్లాకు చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు, తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, కుత్తుం దుష్యంత్, పోతనపల్లి కామేశ్వరరావు తదితరులు ఒక ప్రకటనలో ఖండించారు.

# రోడ్డెక్కిన ఆఫ్‌షోర్ నిర్వాసితులు



రేగులపాడు ఆఫ్‌షోర్ నిర్వాసితుల ఆందోళన

**మెళియాపుట్టి:** మండలంలోని రేగులపాడు ఆఫ్‌షోర్‌కు గ్రామాన్నిచ్చిన చీపురుపల్లి నిర్వాసితులు గురువారం రోడ్డెక్కి నిరసన తెలిపారు. అక్కడే నిరాహార దీక్ష చేపట్టారు. పలువురు నిర్వాసితులు మాట్లాడుతూ.. హిరమండలం నిర్వాసితులకు ఇచ్చిన 460 జీఓ ప్రాప్తికి పూర్తిస్థాయి ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. వలస వెళ్లిన 132 మంది నిర్వాసితులకు ప్యాకేజీలు ఇవ్వలేదన్నారు. నిర్వాసితులందరికీ అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని, డీ పట్టా భూములకు సొమ్ములు చెల్లించాలని, చెల్లింపుల్లో తేడాలు ఉన్నాయని వాటిని సవరించి ఇళ్లకు పరిహారం చెల్లించాలన్నారు. పలాస మండలం గోపీవల్లభపురం, టెక్కలిపట్నంలో నిర్వాసితులకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టినప్పటికీ అక్కడ మౌలిక సదుపాయాలు లేవని, శ్మశాన వాటికలు, ప్రభుత్వ భవనాలు, రోడ్లు, తాగునీటి సదుపాయం లేదని అన్నారు. అన్ని సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు దీక్షలు కొనసాగుతాయన్నారు.

# కుటుంబం ఆత్మహత్యాయత్నం

- పోలీసుల వేధింపులు తట్టుకోలేకేనని ప్రచారం
- శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న కుటుంబ సభ్యులు



108 వాహనంలో ఆస్పత్రికి వెళ్తున్న పురుగు మందు తాగిన కుటుంబ సభ్యులు

**ఎచ్చెర్ల క్యాంపస్/గార:** ఎచ్చెర్ల మండలంలోని ధర్మవరం గ్రామం గురువారం ఉలిక్కిపడింది. గ్రామానికి చెందిన ఎండ మోహనరావు, భార్య రేణుక, కుమార్తె అంజలి పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడడంతో ఊరిలో కలకలం రేగింది. కుమారుడు చేసిన తప్పునకు వీరు ముగ్గురు శిక్ష అనుభవిస్తున్నారని, పోలీసుల వేధింపులు కూడా ఓ కారణమేనని స్థానికంగా చర్చ జరుగుతోంది. పూర్తి వివరాల్లోకి వెళితే.. ఎచ్చెర్ల మండలం ధర్మవరం గ్రామానికి చెందిన ఎండ మోహనరావు, భార్య రేణుక, కుమారుడు చందు, కుమార్తె అంజలి పదేళ్ల క్రితం శ్రీకాకుళం పట్టణానికి బతుకు తెరువు కోసం వెళ్లిపోయారు. ప్రతి నెల రేషన్ కోసం వస్తున్నారు. ఎన్నికలు, పండగలు వంటి సమయంలో వచ్చి మళ్లీ వెళ్లిపోతుంటారు. ప్రస్తుతం శ్రీకాకుళం పట్టణంలోని గుజరాతీపేట సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకొని జీవనం సాగిస్తున్నారు. మోహనరావు శ్రీకూర్మంలోని ఓ దాబాలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. రేణుక కూలి పనులు చేస్తుంటారు. కుమార్తె అంజలికి మానసిక సమస్యలు ఉన్నాయి. కుమారుడు చందు విజయవాడలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గత నెల చందు విజయవాడలో ఓ బాలికతో పరారైపోయాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ కోసం కుటుంబ సభ్యులను పోలీసులు విజయవాడ తీసుకెళ్లి.. విచారణ అనంతరం అక్కడే వదిలేసేవారు. మాటిమాటికీ ఇలా వెళ్లిరావడం ఈ కుటుంబానికి తలకుమించిన భారమైంది. రవాణా ఖర్చులు సైతం ఇబ్బందిగా మారాయి. దీంతో ఊరిలోని పెద్దలను కలిశారు. వారు కూడా ఏమీ చేయలేమంటూ చేతులెత్తేశారు. కుమారుడి నుంచి కూడా ఎలాంటి సంప్రదింపులు లేవు. దీంతో వారు ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించారు.

గురువారం మధ్యాహ్నం తల్లిదండ్రులు కుమార్తెతో కలిసి శ్రీకాకుళం పాతబస్టాండ్ సమీపంలో ఆటో ఎక్కి గార మండలం వత్సవలస వద్ద దిగారు. అక్కడ పొలాల్లోకి వెళ్లి తమ వెంట తెచ్చుకున్న పురుగు మందు తాగేశారు. తాగాక 108కు వారే ఫోన్‌చేసి పరిస్థితి వివరించారు. దీంతో వీరిని అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్చారు. ప్రాథమికంగా ప్రాణహాని లేనట్లు వైద్య వర్గాలు తెలిపాయి. వీరి నుంచి ఔట్ పోస్టు పోలీసులు స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఆస్పత్రి వర్గాల సమాచారం మేరకు గార పోలీసులు కూడా కేసు నమోదు చేశారు.

# బాల్యానికి రంగులు..





**ఒకరి కాగితంపై మిక్కీ మౌస్ అందంగా నవ్వుతూ ఉంటుంది. మరొకరి పేపర్‌పై రోజా పువ్వు భలే నాజూగ్గా కనిపిస్తుంది. ఇంకొకరి కాన్వాస్‌పై మూడు రంగుల జెండా మెరిసిపోతూ ఉంటుంది. వేసవి సెలవుల్లో జిల్లా కేంద్రంలోని లాఫింగ్ క్లబ్ బాల్యానికి రంగులు అద్దుతోంది. ఆసక్తి గల చిన్నారులకు బొమ్మలు వేయడం నేర్పుతోంది. వేసవి సెలవుల్లో అందివచ్చిన అవకాశాన్ని చిన్నారులు కూడా రెండు చేతులా అందిపుచ్చుకుంటున్నారు.**

- వేసవి సెలవుల్లో లాఫింగ్ క్లబ్ 'గీతా' బోధన
- డ్రాయింగ్‌తో పాటు సంగీతం, పెయింటింగ్‌పై కూడా శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్:

**జి**ల్లా కేంద్రంలోని లాఫింగ్ క్లబ్ వేసవిలో చిన్నారుల అడ్డాగా మారింది. ఇష్టమైన వ్యాపకాలపై ఇక్కడ శిక్షణ ఇస్తుండడంతో పిల్లలు తమ అభిరుచి మేరకు నేర్చుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. లోకనాథం నందికేశ్వరరావు, బీఎంఎస్ పట్నాయిక్ అనే ఇద్దరు టీచర్లు వేసవి శిక్షణ శిబిరాలను పుష్కర కాలం కిందట కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న తమ ఇంటి వద్ద ప్రారంభించారు. ప్రస్తుతం విద్యార్థులు పెరుగుతున్నందున అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. చిన్నారులకు ఉచితంగా డ్రాయింగ్ వేయడం నేర్పుతున్నారు. ఒక్క డ్రాయింగ్‌లోనే కాకుండా పేపర్ క్విల్లింగ్, కూచిపూడి నృత్యం, సంగీతం, పెయింటింగ్‌పై శిక్షణలు ఇవ్వడం ప్రారంభించారు. ఏటా అన్ని విభాగాల్లో కలిపి మొత్తంగా 200 మంది చిన్నారులు వారి అభిరుచి మేరకు నేర్చుకుంటున్నారు. వీరిలో కొంతమంది ఉద్యోగాలను కూడా సాధించారు. చిల్డ్రన్స్ లాఫింగ్ ద్వారా నేషనల్ స్థాయిలో పలు అంశాలపై పోటీలు నిర్వహించగా ఇద్దరు బహుమతులు సాధించారు. 40 మంది మెడల్స్, సర్టిఫికెట్లు సాధించారు. నందికేశ్వరరావు, పట్నాయక్‌తో పాటు దుర్గా ప్రసాద్, సాయి ప్రసాద్, దీప్తి కూడా తమ సేవలను అందిస్తున్నారు.



చిన్నారులకు డ్రాయింగ్ నేర్పుతున్న దృశ్యం

### సహకరిస్తున్నాను



చిన్నారులంటే నాకు చాలా ఇష్టం. వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీయడం మా ఉద్దేశం. లాఫింగ్ క్లబ్‌కు నా వంతు సహకారం అందిస్తున్నాను. చిన్నారుల బాల్యానికి మెరుగులు దిద్దుతున్న ఇద్దరు స్నేహితులకు అండగా ఉంటున్నాను.

– నటుకుల మోహన్, క్లబ్ నిర్వాహకులు

### డ్రాయింగ్ అంటే ఇష్టం



నాకు డ్రాయింగ్ అంటే ఇష్టం. నేను రోజూ డ్రాయింగ్ తరగతులకు వేసవి సెలవుల్లో వస్తాను. నేను బాగా బొమ్మలు వేయడం నేర్చుకున్నాను.

– భరత్, 9వ తరగతి, శ్రీకాకుళం

### విశ్రాంత జీవితం ఆనందంగా ఉంది



మాకు వచ్చిన విద్యను చిన్నారులకు నేర్పడం ఎంతో తృప్తిగా ఉంది. ముఖ్యంగా చిన్నారులకు వినోదం కలిగించడమే మా ధ్యేయం. విజ్ఞానం కూడా అందిస్తున్నాం. దీని వల్ల విశ్రాంత జీవితం ఆనందంగా ఉంది.

– ఎల్.నందికేశ్వరరావు, రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్

### ఈ వయసులో అవకాశం



నా మిత్రుడు నందికేశ్వరరావు పిలుపు మేరకు నా టాలెంట్‌ను కూడా నలుగురికి పంచాలని అతనికి చేదోడుగా నిలిచాను. ఇది నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. రాబోయే తరానికి మంచి విషయాలు నేర్పడం వల్ల మంచి పౌరులుగా మారుతారు.

– బీఎంఎస్ పట్నాయిక్, రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్

## క్లుప్తంగా

### నరవ మేట్‌లపై విచారణ



నరవ ఉపాధి హామీ మేట్‌లను విచారిస్తున్న ఎంపీడీవో

విజయనగరం ఫోర్ట్: ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు పేరిట బినామీ మస్తర్లు వేస్తున్నారనే అంశంపై సాక్షిలో గురువారం ఉపాధిలో బినామీ మస్తర్లు అనే శీర్షికన ప్రచురించిన కథనానికి గంట్యాడ ఎంపీడీవో ఆర్.వి.రమణ మూర్తి స్పందించారు. బినామీ మస్తర్లు వేసారన్న అభియోగాలు ఉన్న నరవ మేట్‌లను గంట్యాడ ఎంపీడీవో కార్యాలయానికి పిలిపించి విచారణ చేపట్టారు. బినామీ మస్తర్లు వేసిన మేట్‌లను తొలగిస్తామని ఆయన తెలిపారు.

### శ్యామలాంబ హుండీ ఆదాయం రూ.8.19 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సాలూరు: సాలూరు శ్యామలాంబ అమ్మవారి హుండీ ఆదాయం 8,19,900 రుపాయిలు వచ్చినట్లు ఎండోమెంట్ అధికారి రమేష్ గురువారం తెలిపారు. శ్యామలాంబ పండగ నేపథ్యంలో అమ్మవారి గుడికి భక్తులు పోటెత్తారు. హుండీ ఆదాయాన్ని ఆలయంలోనే లెక్కింపు చేపట్టారు.

### ప్రీ ఎక్లాంప్సియాపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కరరావు

పార్వతీపురం టౌన్: గర్భిణుల్లో ప్రీ ఎక్లాంప్సియా ఒక ప్రమాదకర సూచికని, సకాలంలో లక్షణాలు గుర్తించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. ప్రపంచ ప్రీ ఎక్లాంప్సియా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య కార్యాలయ ప్రాంగణంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు హైరిస్క్ సమస్యలు ముందస్తుగా గుర్తించాలన్నారు. బీపీ అధికంగా ఉండడం, తీవ్రమైన తలనొప్పి, దృష్టి సమస్య, ముఖం,చేతులు, కాళ్లు ఉబ్బడం, మూత్ర విసర్జన తగ్గడం తదితర లక్షణాల ద్వారా దీన్ని గుర్తించాలన్నారు. జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్మోహనరావు, పీఎల్ రఘుకుమార్, డీపీహెచ్ఎన్‌వో ఉషారాణి, డీపీవో లీలారాణి, కార్యాలయ సూపరింటెండెంట్ కామేశ్వరరావు, డీసీఎం విజయలత, సీసీ శ్రీనివాసరావు, వైద్య మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### నిర్మాణాలు వేగవంతం చేయాలి : కలెక్టర్

పార్వతీపురం రూరల్: మన్యం జిల్లాలో వివిధ దశల్లో ఉన్న పీఎం జన్ మన్ గృహ నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం పార్వతీపురం మండలంలోని చప్పవానివలస గ్రామంలో కలెక్టర్ పర్యటించి వివిధ దశల్లో ఉన్న పీఎం జన్ మన్ గృహ నిర్మాణాలను ఆయన నేరుగా స్థానిక అధికారులతో కలసి పరిశీలించారు. గృహ నిర్మాణాలు జాప్యానికి గల కారణాలను అధికారులను, లబ్ధిదారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, పనులను మరింత వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణానికి సంబంధించిన రెండవ విడత బిల్లులు మరి కొద్ది రోజుల్లో మంజూరు కానున్నాయని, తక్షణమే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. గృహ నిర్మాణాలకు సంబంధించిన మెటీరియల్ ఎంతమేరకు అందుబాటులో ఉందో అధికారులను ఆరా తీశారు. గృహ నిర్మాణ పనులకు ఆటంకం లేకుండా అవసరమైన మెటీరియల్‌ను ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని హితవు పలికారు. కలెక్టర్ పరిశీలన కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఇంజినీరింగ్ అధికారి జి.సోమేశ్వరరావు, చిరంజీవి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పీఎస్ నాయుడు పాల్గొన్నారు.

### అమ్మవారి హుండీల్లో చోరీ

సాలూరు: పట్టణంలోని పలు ఆలయాల్లో హుండీల్లో చోరీలు జరిగాయి. పట్టణంలోని నూకాలమ్మ తల్లి, సత్తమ్మ తల్లి, దేశమ్మ తల్లి ఆలయాల్లో హుండీలను దుండగలు పగులగొట్టి నగదు, కానుకలను ఎత్తుకెళ్లారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

### సీతంపేటలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

పార్వతీపురం టౌన్: ప్రజాసమస్యల పరిష్కార వేదికను సోమావారం 10 గంటల నుంచి సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహిస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను సీతంపేట వచ్చి అందజేయాలని కోరారు. జిల్లా అధికారులందరూ సీతంపేటలో జరిగే పీజీఆర్ఎస్‌కు హాజరుకావాలని ఆయన ఆదేశించారు.

# జాడ లేని సంక్షేమం..!

- అర్థాకలితో నిర్మాణ రంగ కార్మికులు
- ఉమ్మడి జిల్లాలో నిలిచిపోయిన 1590 క్లెయిమ్స్
- కార్మికుల సంక్షేమం పట్టని కూటమి ప్రభుత్వం
- ఎన్నికల నాటి హామీలు ఏమయ్యాయి?



పనిలో నిమగ్నమైన భవన నిర్మాణ కార్మికులు

విజయనగరం గంటస్తంభం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ రంగ కార్మికుల పొట్టకొట్టింది. కార్మికుల సంక్షేమ బోర్డులోని నిధులను దారి మళ్లించారు. కనీసం మరణ క్లెయిమ్స్, ప్రసూతి క్లెయిమ్స్, స్కాలర్‌షిప్ క్లెయిమ్స్, అనారోగ్య క్లెయిమ్స్ కూడా అందకుండా చేశారు. ఫలితంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలోని సుమారు 1590 క్లెయిమ్స్ ఇప్పుడు వరకు అపరిష్కృతంగానే ఉన్నాయి. భవన నిర్మాణ, ఇతర అసంఘటిత రంగ కార్మికులు, కూలీల జీవితాలు కొద్ది నెలలుగా దుర్భరంగా మారాయి. అరకొర పనులు, అప్పుల బాధలు, కష్టాల సుడిగుండాల్లో చిక్కుకుని కొట్టుమిట్టాడుతున్నారు. పిల్లల చదువులు, ఇంటి అద్దెలు, ఇతర ఖర్చులకు సైతం డబ్బు పుట్టక బతుకు భారంగా ఈడుస్తున్నారు. సూపర్ సిక్స్, సెవెన్ అంటూ అలవిగాని హామీల వర్షం కురిపించి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసింది.

కొత్త పథకాలు అమలు చేయకపోగా, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలైన పథకాలకు సైతం గండి కొట్టింది. కార్మిక శాఖ లెక్కల ప్రకారం ఉమ్మడి విజయనగరం జిల్లాలో దాదాపు 2లక్షల పైగా మంది అసంఘటిత రంగ భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. లెక్కల్లోకి రాని వారు మరికొన్ని వేలల్లో ఉంటారు. ఇప్పుడు వరకు నమోదు చేసుకున్న భవన నిర్మాణ కార్మికులు 91,528 మంది. వీరిలో ఎక్కువ మంది నిర్మాణ రంగంపై ఆధారపడిన తాపీ మేస్త్రీలు, కూలీలు, రాడ్ బెండర్లు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, వడ్రంగులు, పెయింటర్లు ఉన్నారు. గతేడాది సార్వత్రిక ఎన్నికలప్పుడు భవన నిర్మాణ బోర్డును పునరుద్ధరిస్తామని టీడీపీ మేనిఫెస్టోలో చంద్రబాబు హామీ ఇచ్చారు. సాధికార సంస్థ ఏర్పాటు చేస్తామని, అన్ని వర్గాల కార్మికులకు ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్, తదితర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని, కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నేటి వరకు ఆ ఊసే ఎత్తలేదు.

#### గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సాయం ఇలా..

వైఎస్సార్ కల్యాణమస్తు కింద భవన, ఇతర నిర్మాణ కార్మికులకు రూ.20వేలు చొప్పున అందించారు. వైఎస్సార్ బీమా పథకం కింద ప్రమాద మరణాల్లో బాధిత కుటుంబాలకు రూ.5 లక్షలు, సహజ మరణాలకు రూ.లక్ష, వైకల్యం సంభవిస్తే రూ.5 లక్షల చొప్పున ఇచ్చి ఆదుకున్నారు. రిజిస్టర్ కాని కార్మికులు ప్రమాదాల్లో మరణిస్తే రూ.5 లక్షలు, వైకల్యం సంభవిస్తే రూ.2.5 లక్షలు ఇచ్చారు. అసంఘటిత రంగ కార్మిక కుటుంబాల్లోని వ్యక్తులు అనారోగ్యం బారిన పడిన సందర్భాల్లో ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.25 లక్షల వరకు వైద్య సేవలను పూర్తి ఉచితంగా అందించారు.

#### పేరు మార్పు తప్ప సాయం లేదు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ బీమా పథకాన్ని చంద్రన్న బీమాగా పేరు మార్చారు. అంతకు మించి పథకం అమలుపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలన్నీ ఉత్తివిగానే మిగిలిపోయాయి. గత ప్రభుత్వంలో వైఎస్సార్ బీమా పథకం కింద విజయనగరం జిల్లాలో దాదాపు 11వేల కుటుంబాలకు రూ.118 కోట్ల మేర సాయం అందింది. ఈ ప్రభుత్వంలో అది పూర్తిగా నిలిచిపోయింది.

#### కార్మికుల పొట్ట కొట్టారు..



కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్న పైసా కూడా ఇవ్వలేదు. కార్మికులకు తీరని అన్యాయం చేసింది. విజయనగరం జిల్లా పరిధిలో చాలా మంది కార్మికులకు గుర్తింపు ఇవ్వలేదు. ఈ ఏడాదిలో ఒక్క క్లెయిమ్ చెల్లించలేదు. ప్రభుత్వం ఏమాత్రం సాయం చేయడం లేదు. భవన నిర్మాణ రంగాన్ని నిర్లక్ష్యం చేసింది.

-బి.రమణ
జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి

#### ఆదుకునే పథకాలేవీ?

రోజూ ఉదయాన్నే విజయనగరం గణేష్ గుడి మీదకు పని కోసం వస్తాను. వారంలో మూడు రోజులు పని దొరకడం చాలా కష్టంగా ఉంటోంది. గతంలో ఈ పరిస్థితులు లేవు. పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో జీవనం సాగిస్తున్నాం. ముఖ్యంగా పిల్లల చదువులు భారంగా మారాయి. గతంలో అమ్మ ఒడి, వసతి దీవెన కింద సాయం అందేది. ఇప్పుడు ఆదుకునే ఆ పథకాలు కూడా లేకుండా పోయాయి.

– సత్యం, తాపీ మేస్త్రీ, విజయనగరం

#### కార్మిక బోర్డును తక్షణమే పునరుద్ధరించాలి



ఎన్ని ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన భవన నిర్మాణ కార్మికులకు ప్రయోజనం లేకుండా పోయింది. ఇసుక కొరత లేకపోయినా పనుల్లేకుండా పోయాయి. భవన కార్మికుల సంక్షేమ బోర్డును రద్దును పునరుద్ధిరస్తానన్న కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఆ ఊసే లేదు. కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి.

-మజ్జి ఆదినారాయణ,
భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

#### ఆగిన ఇళ్ల నిర్మాణం

గత ప్రభుత్వం మా ఊర్లో పేదల ఇళ్ల నిర్మాణం కోసం పెద్ద ఎత్తున లేఅవుట్లు ఏర్పాటు చేసింది. వాటిలో వేలల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. దీంతో బయటకు ఎక్కడికి వెళ్లే పని లేకుండా ఊర్లోనే పనులు ఉండేవి. ఈ ప్రభుత్వం వచ్చాక కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. పెయింటింగ్, ఉడ్‌వర్క్స్, ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికులపై ఈ ప్రభావం పడుతోంది. వారాలు, నెలల తరబడి ఇంటి పట్టునే ఉంటే మా కుటుంబాలు ఎలా గడుస్తాయి?

-కృష్ణ అప్పారావు,
పెయింటర్, విజయనగరం

## భూ సమస్యలు తలెత్తకూడదు..: జేసీ



సమావేశంలో పాల్గొన్న ఐదు మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది

గజపతినగరం : గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతన్నలకు భూ సమస్యలు వస్తే తక్షణమే ఆయా గ్రామాలకు వెళ్లి సమస్యలను పరిష్కారం చేయాలని రెవెన్యూ అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ ఆదేశించారు. గజపతినగరం మండల కేంద్రం పురిటిపెంట పాల్తేరు వారి కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన ఐదు మండలాల రెవెన్యూ అధికారుల కాన్ఫరెన్స్ సమావేశానికి అయన ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు సలహాలు ఇచ్చారు. రైతులు సమస్యలతో కార్యాలయాలకు వచ్చినప్పుడు వారిని ఆహ్వానించి వారి సమస్యలను సంపూర్ణంగా అడిగి తెలుసుకొని పరిష్కరించేలా ఉండాలని సిబ్బందికి సూచించారు. భూ సమస్యల పరిష్కారం విషయంలో రీసర్వే అయిన తరువాత వచ్చిన ఎల్‌పీఎం నంబర్లు, సర్వే నంబర్లు టాలీ చేసుకొని తప్పులు దొర్లకుండా క్షేత్ర స్థాయికి వెళ్లి వాస్తవాలను తెలుసుకొని పరిష్కరించాలని సూచించారు. బొబ్బిలి ఆర్‌డీవో జెవిఎస్ ఎస్.రామ్మోహన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలాగాంధీ, ఈడీ ఎస్సీ సొసైటి ఇంచార్జ్ ఆర్‌డీవో వెంకటేశ్వరరావు, స్థానిక తహసీల్దార్ బి.రత్న కుమార్‌తో పాటు ఐదు మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు, డీటీలు తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకకు వచ్చి.. మృత్యు ఒడిలోకి...



ప్రమాదంలో మృతి చెందిన గెద్ద రామకృష్ణ

తెర్లాం: వివాహ వేడుకలకు వెళ్లొస్తానని చెప్పి వెళ్లిన కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని తెలుసుకున్న తల్లి, తమ్ముడు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. నాలుగు రోజుల కిందట తెర్లాం మండలంలోని రాజయ్యపేట గ్రామానికి వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన ఓ యువకుడు బుధవారం రాత్రి జరిగిన ఆటో బోల్తా పడిన ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. దీనికి సంబంధించి తెర్లాం ఎస్‌ఐ సాగర్‌బాబు, కుటుంబ సభ్యులు గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గరివిడి మండలం కోడూరు గ్రామానికి చెందిన గెద్ద రామకృష్ణ(24) తెర్లాంలోని శ్రీ వేంకటేశ్వర కళాశాల వద్ద బుధవారం రాత్రి ఆటో బోల్తా పడిన ప్రమాదంలో మరణించాడు. తెర్లాం మండలం రాజయ్యపేట గ్రామంలో జరగనున్న వివాహ వేడుకలో పాల్గొనేందుకు తన మేనమామ ఇంటికి నాలుగు రోజుల క్రితం రామకృష్ణ వచ్చాడు. అక్కడ జరిగిన వివాహ వేడుకలో పాల్గొని అందరితో సరదాగా గడిపాడు. బుధవారం రాత్రి తెర్లాం మండలం ఎం.ఆర్ అగ్రహారంలో జరుగుతున్న స్నేహితుని వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు రామకృష్ణ తన చినమేనమామతో కలిసి ఆటోలో వెళ్లాడు. వివాహ వేడుకలో పాల్గొని అక్కడ భోజనం చేసి తిరిగి రాజయ్యపేట గ్రామానికి ఆటోలో వెళ్తున్నాడు. ఆటోను తన చినమేనమామ నడుపుతుండగా అతని పక్కన రామకృష్ణ కూర్చొన్నాడు. తెర్లాం వెంకటేశ్వర కళాశాల వద్దకు వచ్చే సరికి ఆటో అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలోకి బోల్తా పడింది. దీంతో రామకృష్ణ కింద పడిపోగా, ఆటో అతనిపై పడిపోయింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న కొందరు రామకృష్ణను బయటకు తీశారు. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆసుపత్రిలో చికిత్స చేసేటప్పటికే రామకృష్ణ మృతి చెందినట్టు వైద్యులు తెలిపారని ఎస్‌ఐ చెప్పారు. మృతుని సోదరుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించినట్టు ఎస్‌ఐ సాగర్‌బాబు తెలిపారు.

#### బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ..

రామకృష్ణ బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. రామకృష్ణ తండ్రి వెంకటరమణ ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి రామకృష్ణ బైక్ మెకానిక్‌గా పని చేస్తూ తనకు వచ్చే కొద్దిపాటి ఆదాయంతో తల్లి, తమ్ముడిని పోషిస్తున్నాడు. వివాహ వేడుకకు మేనమామ ఊరు వెళ్లి వస్తానని చెప్పి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని తెలుసుకున్న రామకృష్ణ తల్లి, తమ్ముడు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

## అప్పల బాధ భరించలేక వ్యక్తి ఆత్మహత్య



సువ్వాడ గాంధీ(ఫైల్)

గుర్ల: మండలంలోని కెల్లకు చెందిన సువ్వాడ గాంధీ (32) అప్పులు బాధ భరించలేక పురుగులు మందు తాగి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. కెల్లకు చెందిన సువ్వాడ గాంధీ తన అవసరాల నిమిత్తం అప్పులు ఎక్కువగా తీసుకున్నాడు. అప్పులు తిరిగి చెల్లించాలని ఒత్తిడి రావడంతో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఇది గమనించి కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స అందుతుండగా గురువారం ఆసుపత్రిలో మృతి చెందాడు. మృతునికి భార్య మంగ, కుమారుడు రుషివర్ధన్, కుమార్తె లహరి ఉన్నారు. గుర్ల ఎస్‌ఐ నారాయణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

#### ఉపాధి వేతనదారు మృతి



తవుడమ్మ (ఫైల్)

బాడంగి: మండలంలోని కోటిపల్లి గ్రామానికి చెందిన ఉపాధి వేతనదారు చెలపురెడ్డి తవుడమ్మ(68) పని చేస్తున్న ప్రదేశంలో గురువారం మృతి చెందినట్టు ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు మరియదాస్ తెలిపారు. గ్రామంలో జగ్గన్న చెరువు పూడిక పనులు చేస్తుండగా చద్దన్నం తిని చేతులు కడుగుతుండగా తీవ్ర అస్వస్థతకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న ఏపీవో సాయిరాం, టీఏ శ్రీనివాసరావు ఎంపీడీవో ఆదేశాలతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎంపీడీవో వేతనదారు మృతి పట్ల సంతాపం తెలిపారు.

#### చికిత్స పొందుతూ యువకుడి మృతి



నడిపేన పురుషోత్తం(ఫైల్)

నెల్లిమర్ల రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మండలంలోని సారిపల్లి గ్రామానికి చెందిన యువకుడు నడిపేన పురుషోత్తం(27) గురువారం మృతి చెందాడు. యువకుడి మృతిపై కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బద్రీనాథ్ యాత్ర నిమిత్తం యాత్రికులను తీసుకువెళ్లేందుకు బస్సు డ్రైవర్లుగా సారిపల్లికి చెందిన పురుషోత్తం, శ్రీనివాసరావు ఈ నెల 15న వెళ్లారు. 17వ తేదీ అర్ధరాత్రి జార్ఖండ్ రాష్ట్రంలోని రామ్‌గడ ప్రాంతంలో బస్సు రోడ్డు ప్రమాదానికి గురైంది. ఆగి ఉన్న లారీని బస్సు ఢీకొట్టడంతో క్యాబిన్‌లో కూర్చున్న పురుషోత్తంకు తీవ్ర గాయాలయ్యాయి. మరుసటి రోజు చికిత్స నిమిత్తం ప్రైవేటు అంబులెన్సులో విశాఖలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమించడంతో కేజీహెచ్‌కు వైద్యులు పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ పురుషోత్తం ప్రాణాలు విడిచాడు. మృతుడికి తల్లిదండ్రులు, అన్నయ్య ఉన్నారు. పురుషోత్తం మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

### బైక్‌ను ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

రామభద్రపురం: మండల కేంద్రంలోని సాలూరు వెళ్లే బైపాస్ రోడ్డులో కొండకెంగువ జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొట్టి వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని మిర్తివలస గ్రామానికి చెందిన చింతాడ రవి కుమార్ సొంత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై రామభద్రపురం మండల కేంద్రానికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి సొంత గ్రామానికి వెళ్తుండగా బైపాస్ రోడ్డులోని కొండకెంగువ జంక్షన్ వద్దకు వచ్చేసరికి అదే సమయంలో వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స నిమిత్తం స్థానికులు పక్కనే ఉన్న స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి సింహాచలం ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వి.ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

#### రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

భోగాపురం: మండలంలోని మహారాజుపేట జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య, భర్తలకు గాయాలయ్యాయి. భోగాపురం గ్రామానికి చెందిన అచ్యుతరావు, లక్ష్మి దంపతులు సొంత పనుల నిమిత్తం స్కూటీపై తగరపువలస వెళ్తుండగా.. శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. స్థానికులు, కుటుంబ సభ్యులు దంపతులిద్దరినీ తగరపువలసలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై ఎస్‌ఐ సూర్యకుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఉపాధ్యాయ బదిలీల వెబ్‌సైట్ వేగాన్ని పెంచాలి

- ఏపీ టీచర్స్ ఫెడరేషన్ డిమాండ్

పార్వతీపురం టౌన్: రాష్ట్రంలో మొట్టమొదటిసారి బదిలీల చట్టాన్ని అనుసరించి జరుగుతున్న బదిలీల ప్రక్రియలో ఉపాధ్యాయులు బదిలీలకు దరఖాస్తు చేయడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ అన్నారు. గురువారం ఆయన స్థానికంగా మాట్లాడారు. బదిలీలకు దరఖాస్తు చేయడంలో సర్వరు యొక్క వేగాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. ఏఏ పాఠశాలల్లో ఏఏ పోస్టులు అదనంగా ఉన్నాయో ఈ జాబితాల ద్వారా తెలుస్తుందని తద్వారా సంబంధిత ఉపాధ్యాయులు బదిలీకి దరఖాస్తు చేసుకోవాల్సి వుంటుందని పేర్కొన్నారు. కావున ఉమ్మడి విజయనగరం జిల్లాకు సంబంధించి ఉపాధ్యాయుల రీఅపోర్షన్‌మెంట్ వివరాలు వెంటనే అందజేయాలని సంబంధిత అధికారులను కోరుతున్నామన్నారు. న్యాయ స్థానాల ఉత్తర్వులను అనుసరించి బెంచి మార్క్ వ్యాధులు గల ఉపాధ్యాయులకు ఈ బదిలీ నియమాలు వర్తించవనీ, అయితే సంబంధిత వ్యక్తులు వారికి అంగీకారం అయితే బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

## వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఇళ్లపై..
# టీడీపీ వర్గీయుల దాడి



రజకుల ఇళ్లపై దాడి చేస్తున్న టీడీపీ వర్గీయులు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

బాడంగి: మండలంలోని పినపెంకి గ్రామంలో అమ్మవారి పండగ ముగింపు రోజు బుధవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన రజకుల ఇళ్లపై అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులైన బెవర కులస్తులు దాడికి తెగబడ్డారు. పిడిగుద్దులతో పాటు కర్రలతో దాడి చేసినట్టు ప్రత్యక్ష సాక్షుల ద్వారా తెలిసింది. ఈ దాడిలో గాయపడిన వాడాడ పోలమ్మ, వెంపడాపు రమేష్, నందిగాం సీత, చోడవరపు అరుణలను గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కుప్ప సింహాచలం స్థానిక సీహెచ్‌సీకి ఆటోపై తరలించారు. వీరిలో పోలమ్మ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వీరిలో అరుణ బాలింత కావడంతో ప్రథమ చికిత్స చేసి ఇంటికి పంపినట్టు వైద్యులు తెలిపారు. ఇదే విషయమై రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా గ్రామంలో ఇరు వర్గాలకు చెందిన యువకుల మధ్య మంగళవారం నాడే తగాదా జరిగింది. టీడీపీ వర్గీయులు ఎప్పుడు ఎలాంటి దాడులకు పాల్పడతారోనని రజకులు ఆందోళన చెందుతున్నారు. తమకు భద్రత కల్పించాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు అందినా కేసు నమోదు చేయకుండా తాత్సారం చేస్తున్నట్టు సింహాచలం ఆరోపించారు.

## ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షించాలి



గుంకలాం, కొండకరకంలలో పర్యటించిన నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య తదితరులు

- నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు ఈ నెల 26లోగా పూర్తయ్యే విధంగా పర్యవేక్షించాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సిబ్బందికి ఆదేశించారు. ఈ మేరకు గురువారం గుంకలాం, కొండకరకం ప్రాంతాలలో గృహ నిర్మాణ సంస్థ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఎంత మేర ఇళ్ల నిర్మాణాలు జరిగాయి, స్లాబ్ వరకు వచ్చిన ఇల్లు ఎన్ని వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించి ప్రభుత్వ లక్ష్యాన్ని అధిగమించాలని సిబ్బందికి ఆదేశించారు. త్వరలో జరగనున్న గృహప్రవేశాలకు సిద్ధం చేయించాలని చెప్పారు. అనంతరం కేఎల్‌పురంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున పేదల ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలను రూపొందించిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల నిర్మాణాలు పూర్తి కావాలని లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఇందుకోసం ప్రతి లబ్ధిదారులకు అదనంగా 50 వేల రూపాయలను ఇంటి నిర్మాణ పనులు పూర్తయ్యేందుకు ఆర్థిక సాయం అందించనున్నదని తెలిపారు. వివిధ దశలలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించామన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ పీడీ జి.మురళీమోహన్, డీఈ జివి.రంగారావు, ఏఈ కె.రామకృష్ణ పాల్గొన్నారు.

## ఎండీయూ ఆపరేటర్ల ఆందోళన



ధర్నా చేస్తున్న ఎండీయూ వాహనాల ఆపరేటర్లు

విజయనగరం ఫోర్ట్: ఎండీయూ వ్యవస్థను రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వ కేబినేట్ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఏపీ రాష్ట్ర సమైఖ్య ఎండీయూ ఆపరేటర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఎండీయూ వాహనాలతో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంతో 27 వేల మంది కుటుంబాలు రోడ్డున పడతాయని తెలిపారు. రేషన్‌కు బదులు నగదు బదిలీ అమలు కోసం కూటమి ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థపై దాడి చేస్తుందన్నారు. అతి తక్కువ ఖర్చు వేతనాలతో వాహన సర్వీసు, పెట్రోల్, రేషన్ తరలింపు ఖర్చు భరించి ప్రజలకు ఇంటింటికి సకాలంలో పంపిణీ చేస్తున్న వ్యవస్థను రద్దు చేయటం ప్రజల్ని మరింత ఇబ్బందులకు గురిచేయడమే అన్నారు. ధర్నాలో యూనియన్ నాయకులు సిహెచ్.వెంకటరావు, పవన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.